## కలెక్టర్‌ను కలిసిన ట్రెయినీ కలెక్టర్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ట్రెయినీ కలెక్టర్ సలోని

ఎదులాపురం, ఏప్రిల్ 28 : కలెక్టర్ రాజర్షి షాను 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. జిల్లా స్థితిగతులు, ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, పలు తాజా అంశాలపై కాసేపు చర్చించారు. జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్

ఎదులాపురం, ఏప్రిల్ 28 : పాఠశాలలో చదువుతున్న రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పోలీసులు మీకోసంలో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచితంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా నార్నూర్, గాదిగూడ ప్రాంతాలలోని ఆదివాసీ విద్యార్థులు సమ్మర్ క్యాంపులో పాల్గొని వివిధ అంశాల్లో నైపుణ్యం పొందాల్సిందిగా ఎస్పీ తెలిపారు. మే 1 నుంచి 31 వరకు సమ్మర్ క్యాంప్ ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఉదయం 7 నుంచి 8 గంటల 30 నిమిషాల వరకు పోలీసు హెడ్ క్వార్టర్స్ ఆదిలాబాద్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నార్నూర్, పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఈనెల 30వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో పోలీసులు విద్యార్థులకు కరాటే, యోగ, పీఈటీ, వాలీబాల్, కబడ్డీ, క్రీడాంశాల్లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. నాలుగు ప్రాంతాలలో నోడల్ అధికారిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటి 8712659961 ఉండనున్నారని తెలిపారు.

## తప్పుడు సర్టిఫికెట్ పొందిన ఒకరిపై కేసు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 28 : రాజస్థాన్‌లో నివాసముంటూ ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఉంటున్నట్లు రెవెన్యూ కార్యాలయం నుంచి తప్పుడు రెసిడెన్షియల్ సర్టిఫికెట్ పొందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న సోమవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన మనోజ్ షెకావత్ 2023లో సంవత్సరంలో సహస్ర సీమబాల్ (ఎస్ఎస్‌బీ)లో ఉద్యోగం కోసం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నివాసం ఉంటున్నట్లు కొందరి సహకారంతో రెసిడెన్షియల్ సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. రీ వెరిఫికేషన్‌లో అతను ఇంద్రవెల్లి మండలకేంద్రంలో నివసించడం లేదని తెలుపడంతో ఈ కేసును సమోటోగా తీసుకొని అతనితోపాటు సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

## ప్రతిభకు తగిన పురస్కారం

ఎదులాపురం, ఏప్రిల్ 28: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి తగిన పురస్కారం అందజేస్తామని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరిస్తూ మాదకద్రవ్యాలను నిర్మూలనకు కృషిచేసిన కానిస్టేబుల్ గామ శ్రీనివాస్‌కు పోలీస్ ముఖ్య కార్యాలయంలో సోమవారం ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. శ్రీనివాస్ గత సంవత్సరం జిల్లాలో గంజాయి నిర్మూలన కృషి చేశాడని, దానికి రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి, లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్, ఇతర ఉన్నతాధికారుల చేతుల మీదుగా నగదు రివార్డును అందుకున్నాడన్నారు. సిబ్బంది ఇలాగే విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మాదకద్రవ్యాల అరికట్టడిలో తమ వంతు పాత్ర పోషించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

## ఆర్టీసీ బస్సు అద్దం పగులగొట్టిన ఒకరిపై కేసు

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 28 : భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన యువకుడు కోరింగా పింటూ సోమవారం అర్లి(టీ) వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు నిపాని వద్ద ఆపలేదని రాయితో కొట్టాడు. దీంతో వెనుక భాగంలో రూ.3 వేల విలువైన అద్దం పగిలిపోయిందని, అలాగే ప్రయాణికురాలు లక్ష్మి గాయమైందని తెలిపారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముంతాజ్ అహ్మద్ తెలిపారు.

## పరారీ నిందితుడి అరెస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 28 : రౌడీయిజం కేసులో ఈనెల 22న రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పరారీలో ఉన్న నిందితుడు సర్దార్‌ను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. రౌడీయిజం చేస్తూ డబ్బులు వసూలు చేసి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీయిజం గ్రూపులు కట్టడం డబ్బులు వసూలు చేయడం ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం లాంటి కార్యక్రమాలను ఉపేక్షించేది లేదని ఆదిలాబాద్ డీఎస్పీ హెచ్చరించారు.

## దాడి కేసులో ఒకరు..

ఎదులాపురం, ఏప్రిల్ 28 : దాడి చేసిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 26న ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ గ్రౌండ్‌లో మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన మహమ్మద్ అష్రఫ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఆదిలాబాద్ పట్టణం చెందిన సయ్యద్ ముసిన్, మమ్మద్ ఖాజిం, సందీప్ రూ.5 లక్షలు ఇవ్వమని డిమాండ్ చేశారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలనడంతో అష్రఫ్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ తెలిపారు. కాగా సోమవారం రాత్రి దాడి చేసిన వ్యక్తుల్లో సుందరయ్య నగర్‌కు చెందిన సయ్యద్ మోసిన్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

## రోడ్డు పక్కన మృతదేహం శరీర భాగాలు లభ్యం

నేరడిగొండ, ఏప్రిల్ 28 : మండలంలోని నారాయణపూర్ గ్రామ పరిధిలోని ఘాట్ వద్ద జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని మానవ మృతదేహం శరీర భాగాలు పడిఉన్నట్లు నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం నారాయణపూర్ గ్రామస్తులు రోడ్డు పక్కన మనిషి మృతదేహం శరీర భాగాలు పడిఉండడాన్ని గమనించి పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి అనూష గ్రామస్తులతో కలిసి పరిశీలించి విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఘాట్ ప్రాంతంలో రోడ్డు పక్కన మనిషి మృతదేహం తల, నడుము, కాళ్లు,కింద దవడ, చేతి ఎముకలు, పక్క ఎముకలు, తదితర భాగాలు పడి ఉన్నాయని తెలిపారు. దీంతో ఇచ్చోడ సీఐ భీమేశ్, నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రోడ్డు పక్కన నాలుగు మీటర్ల దూరంలో మృతదేహం భాగాలు కాల్చి ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శి అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్

- తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు
- ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్



ఖానాపూర్, ఏప్రిల్ 28 : వరంగల్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నిర్వహించిన రజతోత్సవ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సభకు ఖానాపూర్ నియోజకవర్గం నుంచి నాలుగు వేల మంది పార్టీ శ్రేణులు వస్తారని భావించగా, అంతకుమించి తరలి వెళ్లారని పేర్కొన్నారు. చాలా మంది బీఆర్ఎస్ శ్రేణులు వారు వచ్చే రోడ్లపైనే వాహనాలు నిలిచిపోవడంతో కేసీఆర్ ప్రసంగం ఫోన్లలోనే వినాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సభతో పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం వచ్చిందని పేర్కొన్నారు. రజతోత్సవ సభను విజయవంతం చేసిన ఖానాపూర్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సభ విజయవంతం

- బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్



కుభీర్, ఏప్రిల్ 28 : వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలకేంద్రంతోపాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు, శ్రేయోభిలాషులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీపై మీ అభిమానం ఎల్లవేళలా ఇలాగే కొనసాగాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ ఆకాంక్షించారు. సోమవారం ఆయన కుభీర్‌లో మాట్లాడుతూ, వరంగల్ సభలో మన ప్రియతమ నాయకుడు కేసీఆర్ సంధించిన అస్త్రాలు కాంగ్రెస్ పార్టీతోపాటు రేవంత్ సర్కారులో వణుకు పుట్టించాయని అన్నారు. ఏది ఏమైనప్పటికీ వరంగల్ సభ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిందని పేర్కొన్నారు. ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాల డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడిపి సురక్షితంగా అందరిని వారి వారి గ్రామాలకు తరలించారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇక్కడ ఎన్నీల అనిల్, రేకుల గంగాచరణ్, మోహియొద్దీన్, దొంతుల దేవీదాస్ ఉన్నారు.

## ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి



నిర్మల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ): ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నిర్మల్ నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే రాంకిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం నుంచి 3 వేల మందిని వరంగల్ సభకు తీసుకెళ్లాలని భావించామని, కాని అంతకంటే ఎక్కువ మంది తమ సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా తరలి వచ్చారన్నారు. ప్రజల్లో వచ్చిన స్పందన చూస్తుంటే మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టమైపోయిందన్నారు. కేసీఆర్ సభకు వచ్చిన ఆదరణను చూసి కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారన్నారు. ఆ పార్టీకి చెందిన మంత్రులు నోటికొచ్చింది మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ నాయకులకు కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. వచ్చే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తన్ని తరిమేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

## యూపీఎస్‌సీలో ర్యాంకు సాధించిన యువకుడికి సన్మానం

తలమడుగు, ఏప్రిల్ 28 : మండలంలోని పల్సి(బీ) తండా గ్రామానికి చెందిన యువకుడు జాదవ్ సాయి చైతన్య ఇటీవల విడుదలైన యూపీఎస్‌సీ ఫలితాల్లో ఆల్ ఇండియా 68వ ర్యాంక్ సాధించారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై సాయి చైతన్య, తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గుట్టపైన సాయి చైతన్య ముత్యంలా పుట్టారన్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామమైన పల్సి(బీ) తండా నుంచి ఐఏఎస్ సాధించి మారుమూల గ్రామం పేరును దేశ స్థాయిలో నిలిపిన సాయి చైతన్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సాయి చైతన్య, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## 'మై ఆటో ఈస్ సేఫ్'పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

బేల, ఏప్రిల్ 28 : 'మై ఆటో ఈస్ సేఫ్'పై వారసంతలో పోలీసులు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని వారసంతలో జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, ఎస్ఐ దివ్యభారతితో కలిసి ఆటో యూనియన్ సభ్యులకు మై ఆటో ఈస్ సేఫ్‌పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సురక్షితమైన ప్రయాణం, భద్రత కోసమే 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్మక్రమ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా 50 ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేస్తున్నామన్నారు. ఆటోలో ప్రయాణించే వారికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుస్తాయని, దాంతో తాము సురక్షితంగా ప్రయాణం చేస్తున్నామని ధీమా కలుగుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మండలంలో ప్రతి ఆటోకు ఈ క్యూఆర్ కోడ్ అనుసంధానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బేల ఎస్ఐ దివ్య భారతి, ఏఎస్ఐ జీవన్, సిబ్బంది ప్రభాకర్, రాందాస్, తయ్యాబ్, లక్ష్మి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఒప్పంద ఆధ్యాపకుల సమ్మె

బాసర, ఏప్రిల్ 28 : బాసర ఆర్జీయూకేటీలో ఒప్పంద అధ్యాపకుల నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. సోమవారం తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ప్రధాన డిమాండ్‌తో సీఎం రెస్పాండ్ అనే అక్షరాలు రాసి నిరసన తెలిపారు. విశ్వవిద్యాలయంలో 17 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో సేవలందిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తు ప్రథమ విధిగా పనిచేశామన్నారు. ప్రభుత్వం విద్యాశాఖలో కొంత మందిని రెగ్యులరైజ్ చేసి యూనివర్సిటీలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను విస్మరించినందని దానికి ప్రజాప్రభుత్వం నెరవేరుస్తుందనే నమ్మకంతో ఉన్నామని, మా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సతీశ్‌కుమార్, డాక్టర్ వసంతబాబు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమాదేవి,డాక్టర్ మధుసూదన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

ఎదులాపురం, ఏప్రిల్ 28: మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌దరి గ్రామ పంచాయతీ పరిధిలోని దహిగూడ పంప్ హౌస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దహిగూడ పంప్ హౌస్ నుంచి హత్తిగుట్ట, తిప్ప, లోహారా, ఖండాల, ఖానాపూర్, చిచ్‌ధరీ, అల్లికోరి గ్రామాలకు నీటి సరఫరా జరుగుతున్నదని ఎంపీడీవో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కలెక్టర్‌కు విన్నవించారు. యశ్వంత్ గూడ, రాజుగూడ, లోహారాలో బోర్ వెల్ ఏర్పాటుకు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పంప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన రిజిష్టర్‌లో వాటర్‌కు సంబంధించిన వివరాల నమోదు పరిశీలించారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నేరడిగొండ, ఏప్రిల్ 28 : మండలంలోని ఓ గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలలోకి వెళితే, బాల్య వివాహం జరుగుతున్న ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ సమితి చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీసుల సమాచారం అందింది. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు బాల్య వివాహాలతో జరిగే అనర్థాల గురించి బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, డీసీపీయూ కౌన్సిలర్ పద్మ, సోషల్ వర్కర్ రవికాంత్, కృష్ణవేణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు వాహనాలివ్వద్దు

దస్తురాబాద్, ఏప్రిల్28 : తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని ట్రైనీ ఎస్ఐ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించామన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా విధించామని ఆయన తెలిపారు. పిల్లలకు వాహనాలను ఇచ్చిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## నేడు బార్ల కేటాయింపు


ఎదులాపురం, ఏప్రిల్ 28 : జిల్లాలో బార్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి లాటరీ ద్వారా మంగళవారం బార్లను ఎంపిక చేయనున్నట్లు ఆబ్కారీ జిల్లా అధికారి హేమశ్రీ తెలిపారు. జిల్లాలోని 3 బార్ల కోసం 61 దరఖాస్తులు వచ్చాయన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి లక్కీడ్రా తీస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## చట్టాలపై అవగాహన అవసరం

ఉట్నూర్, ఏప్రిల్ 28 : చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం, శిశు సంక్షేమ శాఖ ఆదిలాబాద్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. సోమవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అంగన్‌వాడీల టీచర్స్‌కు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులున్నారు.

# సమస్యలను నేరుగా విన్నవించాలి

ఉట్నూర్, ఏప్రిల్ 28 : గిరిజనులు తమ సమస్యలను నేరుగా ఐటీడీఏ అధికారులకే విన్నవించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం గిరిజన దర్బార్‌లో గిరిజనులతో మాట్లాడుతూ, తమ అర్జీలు, సమస్యలను నేరుగా ఐటీడీఏకు వచ్చి విన్నవించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు పింఛన్లు కావాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, యువకులు స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేయాలని, రైతులు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇప్పించాలని, వ్యవసాయ పథకాలు అందించాలని, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇక్కడ ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్ కుమార్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు విలాస్ గాదేవార్

## పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు

భైంసా, ఏప్రిల్, 28 : ముథోల్ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, పార్టీ శ్రేణులు బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసినందుకు ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సభను విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అంతేగాకుండా బీఆర్ఎస్ రజతోత్సవ సభ అనగానే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయన్నారు. ఈ సమావేశంలో ఎన్నెల అనిల్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

## సభను సక్సెస్ చేసినందుకు థాంక్స్



లోకేశ్వరం, ఏప్రిల్ 28 : రజతోత్సవ సభకు భారీగా హాజరైన బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలకు సోమవారం ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభ విజయోత్సవంలో పాలుపంచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ధరణి రాజేశ్‌కు కేటీఆర్ అభినందన



ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్‌లో జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ నాయకులతోయ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్‌ను కేటీఆర్ అభినందించారు. సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరవడంపై ఆనందం వ్యక్తం చేసినట్లు రాజేశ్ తెలిపారు. రానున్న రోజుల్లో మరింత కష్టపడి పనిచేయాలని సూచించారని ఆయన పేర్కొన్నారు.

## ఓపిగ్గా వింటూ.. పరిష్కారం చూపిస్తూ..



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 28 : జిల్లా ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి జిల్లా కేంద్రంలోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో తమ సమస్యలను ఎస్పీ అఖిల్ మహాజన్‌కి తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ పోలీస్ ముఖ్య కార్యాలయంతో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు ముఖ్య అధికారిని కలవడానికి వచ్చిన బాధితుల 15 ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా విని సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగం చట్ట వ్యతిరేకం

ఎదులాపురం, ఏప్రిల్ 28 : మాదక ద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేయడం చట్ట వ్యతిరేకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి రిమ్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థుల్లో ర్యాగింగ్ నిర్వహించడం చట్ట వ్యతిరేకమని, ర్యాగింగ్ చేయడం వల్ల సున్నిత మనస్తత్వం కలవారు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. వైద్య విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలకు అలవాటు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆధునిక భారతదేశ అభివృద్ధి వైపు పయనించాలంటే మీలాంటి విద్యావంతులు అవసరమన్నారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి అవసరం ఉన్న ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ రావ్, కళాశాల డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు

- నిర్మల్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 28 : మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నా రు. సోమవారం ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మ ల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్, శాంతినగర్ క్రాస్‌రోడ్, చైన్‌గేట్ సమీపం, గోల్డెన్ ఫం క్షన్ హాల్ దుకాణాల్లో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు విస్తృత తనిఖీలు చేపట్టారు. కొన్ని చోట్ల ఓసీబీ పేపర్స్ దొరికాయని సాధారణంగా వీటిలో గంజాయి చుట్టి కాల్చడానికి వాడుతారని, వీరిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదకద్రవ్యరహిత జిల్లాగా మార్చాలన్న సంకల్పంతో పో లీసు శాఖ పనిచేస్తుందని, అక్రమ రవాణాను అరికట్టి దొరికిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ ప్రవీణ్, ఆర్ఎస్సై రవి, ప్రొబేషనరీ ఎస్ఐ జాబీర్, సుప్రియ పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన తప్పనిసరి

ఎదులాపురం/ తాంసి, ఏప్రిల్ 28 : భూ భారతి చట్టంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ యాపల్ గూడ, తాంసి మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇక్కడ తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, ఆర్డీవో వినోద్ కుమార్, తదితరులున్నారు.

## తరుగు పేరిట దోపిడీ

- రైస్ మిల్లర్లు, కేంద్రం నిర్వాహకుల తీరును నిరసిస్తూ రైతుల ఆందోళన



ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకుల తీరుపై మండిపడుతున్న రైతులు

ఖానాపూర్, ఏప్రిల్ 28 : ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ధాన్యం తరుగు పేరిట రైస్ మిల్లర్లు, నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులు దిగుబడి రాక నష్టపోతుంటే.. రైస్ మిల్లర్లు, కేంద్రం నిర్వాహకులు 40 కిలోలకు బదులు 43 కిలోలు తరుగు పేరిట అధిక తూకం వేస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం లోడింగ్ చేసినా.. లారీలను మూడు రోజులుగా రైస్ మిల్లులకు తరలించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కూడా వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రైతులు రమణ, రాములు, రాజేశ్వర్, మహేశ్, నర్సయ్య, శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు.

## గ్రామ రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్28: గ్రామ రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహసీల్దార్లతో భూభారతి, రెవెన్యూ, సదస్సులు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పంచాయతీలో భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సవిత, స్వాతి, ఈడీఎం నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

సారంగాపూర్, ఏప్రిల్ 28 : మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన తొండకూరి సాయన్న (45) ఆటో బోల్తాపడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, సాయన్న ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి సాయన్న ఆటోను కౌట్ల(బి) నుంచి స్వర్ణ గ్రామానికి నడుపుకుంటూ వెళ్తుండగా, మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో సాయన్నకు తలకు గాయం కాగా, నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. సాయన్నకు భార్య కవిత, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## ఇండ్ల ఎంపికలో అర్హులకు అన్యాయం

ముథోల్, ఏప్రిల్, 28 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీని సక్రమంగా నియమించకపోవడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు విఠల్ కాంబ్లే అన్నారు. సోమవారం బోరిగాం గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ద్వారా ఎంపిక చేసిన అర్హులకు న్యాయం జరగడం లేదని ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన అధికారి రవీందర్ దృష్టికి తీసుకవచ్చారు. అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సరైన లబ్ధిదారులతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలియజేశారు.

## కొనుగోలు కేంద్రాల్లో దోపిడీపై పోరాడాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 28 : వరి కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టేందుకు రైతులు పోరాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డాకురి తిరుపతి, దుర్గం నూతన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ, రైతులు చేసుకున్న అంగీకారం కంటే 1కిలో 300 గ్రాముల ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అదనంగా తీసుకుంటున్నారన్నారు. రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్ల యజమానులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు లింబాద్రి, గంగాధర్, రాములు, కుమార్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.


## ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

బేల, ఏప్రిల్ 28 : ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని మైనార్టీ నాయకుడు ఎజాజుద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాత్రి సమయంలో జమ్మూ కాశ్మీర్‌లో పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు, ఉగ్రదాడికి నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ తీసి మౌనం పాటించారు. ఇక్కడ మైనార్టీ నాయకులు సలీం, ఫిరోజ్, జమీల్, షాహిద్, అసద్, నాయకులు మేషక్ పాల్గొన్నారు.

## 'ఆయిల్ పాం కొనుగోలు చేస్తాం'

సోన్, ఏప్రిల్ 28 : పండిన ప్రతి ఒక్క ఆయిల్ పాం గెలను కొనుగోలు చేస్తామని, ఆయిల్‌పాం రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ప్రీ యూనిక్ ఇండియా ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ ఇన్‌చార్జి ఆఫీసర్ ప్రణీత్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలోని చిన్నారెడ్డి సాగు చేసిన ఆయిల్‌పాం పంట తోటలో రైతులకు అవగాహన కల్పించారు. యజమాన్య పద్ధతులపై ఉద్యాన అధికారులు మౌనిక, ఏరియా మేనేజర్ మనోజ్‌రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ మధు, ఆయిల్‌పాం రైతులున్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉట్నూర్, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అపూర్వ సమ్మేళనంతో ఒక్క చోటికి చేరారు. 24 సంవత్సరాల తర్వాత కలిసి విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని రోజంతా సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులున్నారు.